నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, శనివారం 23 డిసెంబర్ 2023 | KARIMNAGAR



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

## గ్యారెంటీల అమలు కోసం పోరాడాలి

- నిరుద్యోగభృతిపై సర్కారు మాట మార్చింది
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- కాంగ్రెస్ అబద్ధపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- కొత్తపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల మీటింగ్

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్ 22: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలు కోసం పోరాటానికి సిద్ధం కావాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. బూటకపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ విధానాలపై గ్రామాల్లో చర్చపెట్టాలని సూచించారు. ఫస్ట్ క్యాబినెట్ సమావేశంలోనే గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన ఆ ప్రభుత్వం మాటమార్చిందని దుయ్యబట్టారు. నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి ఇప్పుడు చేతులెత్తేసిందని విమర్శించారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రసమయితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గత ఎన్నికల్లో సెంటిమెంట్‌తో గెలిచిన బండి సంజయ్ నియోజకవర్గానికి ఏం చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రంలో వారి ప్రభుత్వం ఉన్నా సాధించిందేమీలేదని ఎద్దేవా చేశారు. కార్యకర్తలు మన ప్రభుత్వంలేదని అధైర్యపడవద్దని, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగబోదని తేల్చిచెప్పారు. తనను నియోజకవర్గ ప్రజలు గుండెల్లో పెట్టి చూసుకున్నారన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పుడు ప్రచారంతో ఓడిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. రాబోయే స్వారత్రిక ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఎమ్మెల్యే సత్యనారాయణ భాష మార్చుకోవాలని హితవు పలికారు. ఐదేండ్లలో ఎంపీ బండి సంజయ్ అభివృద్ధికి ఐదు రుపాయాలు కూడా తేలేదని, వినోద్ ఎంపీగా ఉన్నప్పుడు తెచ్చిన నిధులతోనే కాలం వెల్లదీశాడని విమర్శించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం నాగరాజు, గూడెల్లి తిరుపతి, సిద్ధం వేణు, రావుల రమేశ్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## • మళ్లీ కరోనా ఎఫెక్ట్.. మాస్క్ మస్ట్



దేశంలో మళ్లీ కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతుండడంతో మాస్కులు తప్పనిసరిగా వాడాలని ఆరోగ్య శాఖ సూచించింది. దీంతో విద్యా సంస్థలు, దవాఖానల్లో మస్ట్‌గా మాస్క్ వాడేలా నిబంధనలు అమలు చేస్తున్నారు. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లో పాజిటివ్ కేసులు రావడంతో ప్రభుత్వ దవాఖానలో కరోనా పరీక్షలు చేస్తున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్



కొత్తపల్లి మండల కేంద్రం శివారులో కోయకుండానే వదిలేసిన ఓ రైతు పొలం

## ముంచిన తెగుళ్లు

- వరిపై తీవ్ర ప్రభావం
- నార్లు పోసింది మొదలు, కోతకు వచ్చే దాకా రకరకాల రోగాలు
- అంతంత మాత్రంగానే దిగుబడి
- తాలుగా మిగిలిన పొలాలు
- ఆలస్యంగా నాట్లు వేయడమే కారణం

**గత వానకాలం సీజన్‌లో వరిపై తెగుళ్ల ప్రభావం పడింది. నార్లు పోసింది మొదలు.. కోతకు వచ్చే దాకా రకరకాల రోగాలతో అనేక చోట్ల దిగుబడి బాగా తగ్గిపోయింది. సకాలంలో వర్షాలు రాక ఆలస్యంగా నాట్లు వేయడంతో వచ్చిన తెగుళ్లను తట్టుకునే పరిస్థితి కనిపించలేదు. కొత్తపల్లి, రామడుగు, గంగాధర మండలాల్లో దీని ప్రభావం ఎక్కువగా కనిపించింది. అంతేకాకుండా ఆలస్యంగా నాట్లు వేసిన ప్రతి చోటా రైతులకు ఇలాంటి దుస్థితే ఎదురైంది. ఎకరాకు సగటున 23 నుంచి 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రావల్సి ఉండగా.. 18 నుంచి 20 క్వింటాళ్లే వచ్చాయి. మరీ ఆలస్యంగా వరి నాట్లు వేసిన రైతులకు చేదు అనుభవమే మిగిలింది. పొట్ట దశలో కాండం తొలుచు, మొగి పురుగు వంటి తెగుళ్లు ఆశించి గొలక తాలుగా మారిపోయింది.**

-కరీంనగర్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ)

గత వానకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు అనుకూలించలేదు. జూన్‌లో పూర్తిగా వర్షాలే పడలేదు. దీంతో రైతులు ఆలస్యంగా వరి నార్లు పోయాల్సి వచ్చింది. నాట్లు ఆలస్యంగా పడ్డాయి. పొలాలు పొట్ట దశకు చేరుకునే సరికి పంటను కాండం తొలుచు, మొగి పురుగు వంటి తెగుళ్లు ఆశించాయి. ఈ దశలో ఎన్ని సార్లు పురుగు మందులు వాడినా ఫలితం లేకపోయింది. వర్షాలతో సంబంధం లేకుండా నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో కాస్త ముందుగా నాట్లు వేసినా.. పిలక దశలో కూడా రోగాలు ఆశించాయి. తెగుళ్లను నియంత్రించేందుకు రైతులు చేసిన అనేక ప్రయత్నాలు విఫలమయ్యాయి. పొట్ట దశకు చేరుకునే సమయంలో వచ్చిన తెగుళ్లను అరికట్టడం సాధ్యం కాలేదు. కొత్తపల్లి, గంగాధర, రామడుగు వంటి మండలాల్లో కొందరు రైతులు తమ పొలాల్లో పశువులను మేపుకున్నారు. కొందరు కోత చార్జీలు మీద పడతాయని పొలాలను వదిలేశారు. మెజార్టీ చోట్ల ఆలస్యంగా నాట్లు వేసిన రైతుల పరిస్థితి ఎక్కడా కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు.

### దిగుబడిపై ప్రభావం

వానకాలం వరి సాగుపై తెగుళ్ల ప్రభాం కారణంగా సగటు దిగుబడి తగ్గింది. జిల్లా ప్రణాళికా అధికారులు ప్రతి సీజన్‌లో నిర్వహించే పంట కోత ప్రయోగాల ఫలితాల ప్రకారం చూస్తే.. సగటున 23 నుంచి 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రావచ్చు. వాతావరణం అనుకూలించి, పంటలు సరిగ్గా పండితే ఈ సగటు దిగుబడి శాతం మరింత పెరుగుతుంది. అయితే, పంట కోత ప్రయోగాలకు ఎంపిక చేసిన క్షేత్రంలో పావు గుంటలో దిగుబడిని అధికారులు సేకరిస్తారు. దీనిని తూకం వేసినపుడు 13 నుంచి 14 కిలోలు వచ్చినప్పుడే సగటు దిగుబడి వచ్చినట్లుగా పరిగణిస్తారు. కానీ, ఈ సారి అంతకంటే తక్కువగా 10 నుంచి 12 కిలోలు వచ్చినట్లు తెలుస్తున్నది. దీన్నిబట్టి సాధారణ దిగుబడి కూడా తగ్గినట్లు స్పష్టమవుతుండగా.. ఆలస్యంగా వరి సాగు చేసిన మరి కొందరు రైతుల పరిస్థితి మరింత దారుణంగా కనిపిస్తున్నది. ఇలాంటి రైతుల పొలాల్లో 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి కూడా రానట్లు తెలుస్తున్నది. ఇంకొందరు రైతులైతే పొట్ట దశలో ఆశించిన తెగుళ్లను అరికట్టే పరిస్థితి లేక పశువులను మేపుకున్నారు. కోత ఖర్చులు మీద పడతాయని భావించి మరికొందరు రైతులు పొలంలోనే వదిలేశారు. ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అయితే, అధికారులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు. తెగుళ్లు ఆశించింది నిజమే అయినా దిగుబడిపై అంతగా ప్రభావం చూపలేదని అంటున్నారు.

### పొలమంత తర్రవోయింది



ఈ సారి చెప్పరాని రోగాలచ్చినయి. నష్టం సుతం బాగనే అచ్చింది. రైతులు ఎవ్వలూ సంతోషంగ లేరు. నేను మూడెకరాలల్ల నాటేస్తే పూటకో రోగమచ్చినట్టయ్యింది. ఎప్పుడు లేని తీరుగ ఈసారి ఎనిమిది సార్ల మందులు కొట్టిన. అయినా కంట్రోల్‌గాలె. ఇడ్సిపెడదామని అనుకున్న. ఆశలు వదులుకొని నీళ్లు పెట్టిన. కోస్తే పెట్టువళ్లు సుతం రాలె. హమాలీ పనే దిక్కయ్యింది. మా ఊళ్లె కొంచెం లేటుగ నాట్లేసినం. ఇంకొందరు రైతులైతే వర్లు వదిలేసిన్రు. పొట్టకచ్చినంక దెబ్బతిన్నయి. రెక్కల కష్టం.. పెట్టువడి పోయింది.

- కదారి కుంటయ్య, కురిక్యాల రైతు

### కౌలు పైసలు సుత మీదవడ్డయి



నేను మొత్తం పదెకరాలల్ల వరి సాగు చేసిన. ఆరెకరాలు ముందుగాల నాటేసిన. మిగిలిన నాలుగెకరాలు లేటుగేసిన. లేటుగేసిన నాలుగెకరాలు మొత్తం పోయింది. గొడ్లు, గొర్రె మాకెలు మేపిన. మిగిలిన ఆరెకరాలు కోత్తే ఎకరానికి ఒక్క ట్రాక్టర్ డబ్బ చొప్పున వడ్లచ్చినయి. నా పొలానికి మొగి పురుగు, ఉల్లికోడు వచ్చింది. మందులు ఎంత కొట్టినా పనిచెయ్యలే. అంతకుముందు ఏ రోగాలు లేకుండె. మస్తువండినయ్. ఎకురానికి 25 క్వింటాళ్లకు ఎక్కువనే అచ్చేటిది. ఇప్పుడే అట్లయ్యింది. భూమి మొత్తం నాదిగాదు. కౌలుకుపట్టి నాటేసిన. కౌలు పైసలు సుత మీదవడ్డయి.

- చిటుకూరు ఓదెలు, రైతు (కొత్తపల్లి)

### ఐదెకరాలు కోస్తే వంద బస్తాలైనయి



ఐదెకరాల పొలం కోస్తే వంద బస్తాలైనయి. రోగాలచ్చి పంట బాగ దెబ్బతిన్నది. ఈసారి నార్లు పోసినప్పటి సంది పొట్టకచ్చే దాకా రోగాలే అచ్చినయి. ఇదే నా ఐదెకరాలల్ల మునుపు 350 నుంచి 400 బస్తాల వడ్లచ్చేది. ఇప్పుడు పొలమంతా కోస్తే సుత వంద బస్తాలే అయినయి. చానా లుక్సానయ్యింది. రోగాల పేర్లు నాకు రావు గాని వచ్చిందంటే వదలలే. మందులు మస్తు కొట్టిన. పాయిదా లేకుంట పోయింది. యాసంగిల నన్న తుట్టి లేకుంట అయితదనుకుంటే ఇప్పుడు నార్లకే రోగమస్తుంది. ఏంజేసుడో ఏమో. ఇట్లయితే ఎవుసం జేసినట్టే.

- ఒగ్గరి మల్లయ్య, రైతు (కురిక్యాల)

## అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కొత్తపల్లి, డిసెంబర్ 22 : విద్యార్థి దశలో విద్యతోపాటు క్రీడారంగాల్లో వచ్చే ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ (ఎస్సీ) పాలిటెక్నికల్ కళాశాలలోని తెలంగాణ క్రీడాప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ 2023–24కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, 11 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి దశలో ఉన్నప్పుడు విద్యతోపాటు క్రీడారంగాల్లో వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తనకు క్రీడల్లో ఎలాంటి అనుభవం లేకపోయినా పాఠశాల స్థాయిలో నిర్వహించే మార్చ్ ఫాస్ట్‌లో చురుకుగా పాల్గొన్నట్లు గుర్తు చేశారు. క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. ఇక్కడ పలు పాలిటెక్నిక్ కళాశాలల ప్రధానోపాధ్యాయులు జీ అప్పారావు, బీ రాజు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**PLOT FOR SALE**

★Residential Plot 2250 Sq. yards for Sale in Prime Residential Area at Near SRR College, Jagityal Road, Karimnagar Town. Ph: 9703544199.
NT-324481

**WANTED**

jobs

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

## పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 22 : మళ్లీ కరోనా వ్యాపిస్తున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సూచించారు. జగిత్యాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎజెండాలోని అంశాలపై చర్చించి, పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశం అనంతరం కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే మాట్లాడారు. జగిత్యాల పట్టణంలో చెత్త సేకరణ తర్వాత ప్లాస్టిక్‌ను వేరు చేసి డంప్‌యార్డులకు తరలించాలని సూచించారు. ప్లాస్టిక్ వేరు చేయకుండానే టీఆర్‌నగర్‌లోని డంప్ యార్డుకు తరలించడం వల్ల చెత్త గుట్టల్లా పేరుకుపోయి డబుల్ బెడ్రూం కాలనీ వాసులకు, టీఆర్‌నగర్ వాసులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. ప్రతి రోజూ కోటి లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామని, లీకేజీలు లేకుండా అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, డీఈ రాజేశ్వర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. కాగా, రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మున్సిపల్ సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఘన స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందించి, ఘనంగా సత్కరించారు.



మెట్‌పల్లి : పట్టుబడిన ఆహార పదార్థాలను చూపుతున్న మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, సిబ్బంది

## కుళ్లిన చికెన్.. పాచిపోయిన బిర్యానీ

- మెట్‌పల్లిలోని ఓ రెస్టారెంట్‌లో నాణ్యతలేని ఆహార పదార్థాలు
- మున్సిపల్ అధికారుల ఆకస్మిక దాడుల్లో బట్టబయలు
- విస్తుపోయిన అధికారులు
- ₹10 వేల జరిమానా

మెట్‌పల్లి, డిసెంబర్ 22 : కుళ్లిపోయి దుర్వాసన వస్తున్న మాంసం.. పాచిపోయిన బిర్యానీ.. కాలం చెల్లిన ఐస్‌క్రీంలు.. బూజ్ పట్టిన ముడిపదార్థాలు.. ఇవీ మెట్‌పల్లిలోని ఓ రెస్టారెంట్‌లో వడ్డిస్తున్న ఆహార పదార్థాలు! అవును నిజమే! అధికారుల ఆకస్మికదాడుల్లో నాణ్యతలేని ఆహారం అందిస్తున్నట్టు బయటపడింది. అక్కడున్న వారిని విస్తుపోయేలా చేసింది. అధికారుల వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మున్సిపల్ అధికారులు శుక్ర రం పట్టణంలోని ఆర్‌బీ రెస్టారెంట్‌లో ఆకస్మిక దాడులు చేశారు. వంటశాల, రిఫ్రిజిరేటర్లు, ఆహార పదార్థాల నిల్వలను పరిశీలించారు. వినియోగదారులకు అందిస్తున్న ఆహార పదార్థాలను అధికారులు విస్తుపోయారు. కుళ్లిన మాంసం,పాచిపోయిన బిర్యానీ, కాలం చెల్లిన ఐస్‌క్రీమ్‌లు, బూజు పట్టిన ఇతర ఆహార వంటకాలు.. తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలను గుర్తించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చికెన్, మటన్, ఫిష్ నిల్వచేసి మరుసటి రోజు కస్టమర్లకు అందజేసినా, అపరిశుభ్రత, నాణ్యతలేని, కాలంచెల్లిన పదార్థాలను విక్రయించినా మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి తప్పుగా ₹10వేలు జరిమానా విధిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, బేకరీలలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతామని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఆర్‌ఐ అక్షయ్,సిబ్బంది విష్ణు, ముజీబ్, నర్సయ్య, అశోక్, నరేశ్, నాయక్ పాల్గొన్నారు.

### కరీంనగర్-తిరుపతి రైలు

## ఇక వారానికి నాలుగు రోజులు

- రైల్వే మంత్రి అశ్విని శ్రీ వైష్ణవ్‌కు ఎంపీ బండి సంజయ్ కృతజ్ఞతలు

విద్యానగర్/ముకరంపుర, డిసెంబర్ 22 : కరీంనగర్ నుంచి తిరుపతికి వెళ్లే రైలు ప్రయాణికులకు మరిన్ని సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఆదివారం, గురువారం మాత్రమే అందుబాటులో ఉండగా, మరో రెండు రోజులు నడిపించనున్నారు. ఇప్పటి వరకు రెండు సర్వీసులు మాత్రమే ఉన్నందున ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా రైలు సర్వీసుల సంఖ్య పెంచాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ శుక్రవారం ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు రైల్వే పెండింగ్ పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ మేరకు వారానికి నాలుగు రోజుల పాటు కరీంనగర్–తిరుపతి రైలు నడిపించేందుకు మంత్రి సానుకూలంగా స్పందించి దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెండు, మూడు రోజుల్లో ఏయే రోజు రైలును నడపాలనే షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు సమాచారం. అదే విధంగా కరీంనగర్ – హసన్‌పర్తి కొత్త రైల్వే లైన్ కోసం ఫైనల్ లొకేషన్ సర్వే పనులు వెంటనే పూర్తి చేసి, కొత్త రైల్వే లేన్ పనులను మంజూరు చేయాలని ఎంపీ మంత్రిని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి ఫైనల్ లొకేషన్ సర్వే పనులను సత్వరమే పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జమ్మికుంట స్టేషన్‌లో సికింద్రాబాద్ నుంచి వెళ్లే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్(12590–89), యశ్వంతపూర్– గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (12592–91), హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ (12723–23), సికింద్రాబాద్ నుంచి పాట్నా వెళ్లే దానాపూర్ ఎక్స్ ప్రెస్ (12791–92), చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్, (12656–55) రైళ్లను ఆపే (హాల్ట్) విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఆయా రైళ్లను జమ్మికుంట స్టేషన్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వేలేన్‌కు సంబంధించి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి దుర్వాసన వస్తున్నందున, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు 11ఏ, 16ఏ, 26, 101, 123ఏ, 134ఏ, 140ఏ, 164, 175ఏ, 775ల వద్ద రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) డ్రైనేజీలను మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## అల్ఫోర్స్‌లో ఘనంగా రామానుజన్ జయంతి

- హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి





బహుమతులు అందుకున్న విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి,కలెక్టర్ పమేలా సత్పతి, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 22 : ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామాజన్ జయంతి వేడుకలను అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు. అనంతరం అల్ఫోర్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## • ముక్కోటి ఏకాదశికి ముస్తాబు



వేములవాడలో ముస్తాబైన ఉత్తర ద్వారం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి, ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, ఇల్లందకుంట సీతారామచంద్రస్వామితో పాటు ప్రముఖ ఆలయాలను విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించారు.

-వేములవాడ టౌన్, డిసెంబర్ 22